# ప్రజల భద్రతే లక్ష్యం..: సీపీ సజ్జనార్



**అక్షరటుడే, హైదరాబాద్:** న్యూ ఇయర్ వేడుకలను హైదరాబాద్ పోలీసులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సచివాలయం వద్ద, చార్మినార్, కేబీఆర్ పార్క్, మెహిదీపట్నం రైతు బజార్ వద్ద కేక్ కట్ చేశారు. చార్మినార్ వద్ద నిర్వహించిన వేడుకల్లో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పాల్గొన్నారు. నగర ప్రజలకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల భద్రతే తమ ప్రాధాన్యం అన్నారు. గడిచిన ఏడాదిలో పోలీస్ శాఖకు సహకరించిన నగర ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. 2026లో కూడా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఇలాగే ఉండాలని కోరారు.


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN


# బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ కొలువులు..

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** గ్రూప్ (సి) నాన్ గెజిటెడ్ అండ్ నాన్ మినిస్టీరియల్ కింద స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టులను భర్తీ చేయడం కోసం బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన మహిళ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం 549 పోస్టులకు గాను పురుషులకు 277, మహిళలకు 272 పోస్టులను కేటాయించారు. 18 నుంచి 23 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులు. జనవరి 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ https://rectt.bsf.gov.in లో సంప్రదించవచ్చు.



**1-1-2026 (Thursday)** | **MAIN EDITION**


## భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**అక్షరటుడే, వరంగల్:** వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నూతన ఏడాది సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. భక్తులతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

## రికార్డు సృష్టించిన యూపీఐ ట్రాన్సాక్షన్లు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** యూపీఐ వాడకంలో దేశం సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. తాజాగా ఎన్‌సీపీఐ విడుదల చేసిన డేటా ప్రకారం.. డిసెంబర్‌లో మన దేశంలో యూపీఐ ట్రాన్సాక్షన్లు భారీగా పెరిగాయి. ఒక్క నెలలోనే ఏకంగా 21.6 బిలియన్ లావాదేవీలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటి విలువ రూ.27.97 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

## స్విట్జర్లాండ్‌లో భారీ పేలుడు..



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** న్యూ ఇయర్ వేడుకల వేళ స్విట్జర్లాండ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఓ బార్‌లో బాంబు పేలుడు కలకలం సృష్టించింది. ఈ ఘటనలో పలువురు మృతి చెందారు. క్రాన్స్ మోంటానా పట్టణంలోని ఓ బార్‌లో పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో అనేక మంది మరణించారని, చాలా మంది గాయపడ్డారని అధికారులు గురువారం తెలిపారు.



## రష్యా ఆక్రమిత ప్రాంతంలో డ్రోన్ దాడి..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కొత్త సంవత్సరం వేళ రష్యా ఆక్రమిత భూభాగంలో డ్రోన్ దాడి జరిగింది. ఖేర్సన్ ప్రాంతంలోని ఖోర్లీ గ్రామంలో ఉన్న హోటల్, కేఫ్‌ను మూడు డ్రోన్లు తాకడంతో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ వివరాలను రష్యా ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ దాడికి పాల్పడిన సమయంలో అక్కడి ప్రజలు న్యూఇయర్ వేడుకల్లో నిమగ్నమై ఉన్నారని చెప్పారు.



## భారీగా పెరగనున్న సిగరెట్ల ధరలు

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** సిగరెట్, బీడీ, పాన్ మసాలా వినియోగించే వారికి ప్రభుత్వం షాకింగ్ న్యూస్ చెప్పింది. వాటి ధరలు ఫిబ్రవరి 1 నుంచి భారీగా పెంచనుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చింది. జీఎస్టీ స్లాబ్‌లను మార్పు చేసింది. దీంతో పలు వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. అయితే సిగరెట్, పాన్ మసాలా, పొగాకు సంబంధిత ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీ విధించనున్నట్లు తెలిపింది. అయితే ఈ మేరకు తాజాగా నిర్ణయం తీసుకుంది. బీడీలపై 18 శాతం జీఎస్టీ వేసింది. పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్ వేసింది.

## ముగ్గురు పిల్లలకు విషమిచ్చి.. తండ్రి ఆత్మహత్య

**అక్షరటుడే, ఏపీ:** ఏపీలోని నంద్యాల జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఓ తండ్రి తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం తొడుములదిన్నేలో గ్రామానికి చెందిన వేములపాటి సురేంద్ర(35) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతడి భార్య గతేడాది ఆగస్టులో అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకుంది. వారికి ముగ్గురు పిల్లలు కావ్యశ్రీ(7), ధ్యానేశ్వరి(4), సూర్య గగన్(2) ఉన్నారు. అయితే భార్య చనిపోవడంతో సురేంద్ర వారి బాగోగులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో ముగ్గురు పిల్లలకు విషం కల్పిన పాలు తాగించాడు. అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్త సంవత్సరం వేళ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పిల్లలను పెంచలేక సురేంద్ర దారుణానికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



# తెగ తాగేశారు

రాష్ట్రంలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు 2025కు వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా న్యూ ఇయర్ సందర్భంగా బుధవారం రాత్రి పార్టీలు చేసుకున్నారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా రాష్ట్రంలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. డిసెంబర్ చివరి 4 రోజుల్లో ఏకంగా రూ.1,230 కోట్ల లిక్కర్ అమ్మకాలు జరగడం గమనార్హం.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- ఎక్సైజ్ శాఖకు న్యూ ఇయర్ కిక్కు
- భారీగా లిక్కర్ సేల్స్
- హైదరాబాద్‌లో జోరుగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు
- పోలీసులకు చిక్కిన 2,731 మంది మందుబాబులు

రాష్ట్రంలో డిసెంబర్‌లో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు సాగాయి. సర్పంచ్ ఎన్నికలు, న్యూ ఇయర్ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖకు భారీగా ఆదాయం వచ్చింది. గతేడాది డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ ప్రారంభం అయింది. అయితే కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారికి తొలి నెలలోనే భారీగా ఆదాయం వచ్చింది. సర్పంచ్ ఎన్నికలు, డిసెంబర్ 31 వేడుకల నేపథ్యంలో నెలలో ఏకంగా రూ.5,052 కోట్ల లిక్కర్ సేల్ అయింది.

### డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున వరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. వారం రోజుల నుంచే డ్రంకన్ డ్రైవ్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. అయినా మందుబాబులు మారలేదు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికిపోయారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లలో 2731 మంది మందుబాబులు దొరికారు. ఇందులో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,198 మంది, సైబరాబాద్ కమిషనరేట్‌లో 928 మంది, మల్కాజ్‌గిరి పరిధిలో 605 మంది ఉన్నారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వారికి రూ.10 వేల జరిమానా వేస్తామని గతంలోనే పోలీసులు చెప్పారు. దీంతో జరిమానాల రూపంలో సైతం భారీగా ఆదాయం సమకూరనుంది.

### మద్యం అమ్మకాల వివరాలు


న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 28 నుంచి మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. 28న రూ.182 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. 29న రూ.282 కోట్లు, 30న రూ.375 కోట్లు, 31న రూ.400 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. నాలుగు రోజుల్లో ఏకంగా రూ.1,230 కోట్ల మందు అమ్ముడుపోయింది. దీంతో ఎక్సైజ్ శాఖకు భారీగా ఆదాయం సమకూరింది.కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడానికి యువత, మద్యంప్రియులు పెద్ద ఎత్తున పార్టీలు చేసుకోవడంతో బీర్లు, విస్కీలు, ప్రీమియం బ్రాండ్ల సేల్స్ జోరుగా సాగాయి.

## తిరుమలలో రికార్డు స్థాయిలో లడ్డూల విక్రయం



**అక్షరటుడే, తిరుమల:** తిరుమలలో గతేడాది లడ్డూ ప్రసాదాలను రికార్డు స్థాయిలో విక్రయించారు. 2024తో పోలిస్తే 2025లో 10 శాతం అదనంగా విక్రయించినట్లు టీటీడీ తెలిపింది. 2024లో 12.15 కోట్ల లడ్డూలు అమ్మగా.. 2025లో ఆ సంఖ్య 13.52 కోట్లకు చేరినట్లు పేర్కొంది. గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా డిసెంబర్ 27న 5.13 లక్షల లడ్డూలను విక్రయించినట్లు వెల్లడించింది. అలాగే ఏడాదిగా ప్రతిరోజూ 4 లక్షల వరకు లడ్డూలను తయారుచేస్తున్నట్లు తెలిపింది. కాగా.. ఇటీవల కాలంలో లడ్డూ నాణ్యత, రుచి పెరగడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు టీటీడీ పేర్కొంది.

## తిరోగమన దిశలో రాష్ట్రం : కేటీఆర్




**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తిరోగమన దిశలో ప్రయాణిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. క్యాలెండర్లు మారుతున్నా రాష్ట్ర ప్రజల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్లను బుధవారం కేటీఆర్ ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేశారు. క్యాలెండర్లు మారుతున్నా.. కాంగ్రెస్‌పై నమ్మకంతో ఓట్లేసిన ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదన్నారు. రెండేళ్లలో రాష్ట్రం అభివృద్ధి వైపు కాకుండా.. తిరోగమన దిశలో పయనిస్తోందని ఆరోపించారు.

## జపాన్‌లో భారీ భూకంపం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** న్యూఇయర్ సంబరాలకు సిద్ధమవుతున్న వేళ జపాన్‌ను మరోసారి భారీ భూకంపం వణికించింది. కొద్ది రోజుల క్రితమే 7.5 తీవ్రతతో సంభవించిన భూకంప ప్రభావాల నుంచి దేశం కోలుకుంటున్న సమయంలోనే, తాజాగా నూతన సంవత్సర వేళ మరో బలమైన భూకంపం చోటుచేసుకోవడం ప్రజల్లో తీవ్ర ఆందోళనను కలిగించింది. జపాన్ తూర్పు నోడా ప్రాంత తీరంలో రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు అమెరికా జియాలజికల్ సర్వే వెల్లడించింది. ఈ భూకంప కేంద్రం నోడా నగరానికి తూర్పున సుమారు 91 కిలోమీటర్ల దూరంలో, సముద్రమట్టానికి సుమారు 19.3 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. భూకంపం ధాటికి పలు ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

## నేటి నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్..



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గురువారం నుంచి నుమాయిష్ ప్రారంభం కానుంది. 85వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన దృష్ట్యా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రతియేటా నుమాయిష్ ఘనంగా నిర్వహిస్తారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు నుమాయిష్ కొనసాగనుంది. నిత్యం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, శని, ఆదివారం, సెలవు రోజుల్లో రాత్రి 11 గంటల వరకు కొనసాగనుంది.

## న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. అయితే పలుచోట్లు న్యూ ఇయర్ వేడుకలు విషాదాన్ని మిగిల్చాయి. హైదరాబాద్ నగరంలోని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని భవాని నగర్‌లో కొంత మంది నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో బిర్యాని తిన్నారు. అది తిని పాండు (53) అనే వ్యక్తి మృతి చెందగా.. మరో 15 మందికి అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జర్మనీలో తెలంగాణ విద్యార్థి మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జర్మనీలో తెలంగాణ విద్యార్థి మృతి చెందాడు. జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన తోకల హృతిక్ రెడ్డి ఉన్నత చదువుల కోసం జర్మనీ వెళ్లాడు. హృతిక్‌రెడ్డి ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో అతడు మంటల నుంచి తప్పించుకోవడానికి భవనంపై నుంచి కిందకు దూకాడు. ఈ క్రమంలో హృతిక్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హృతిక్ మరణ వార్త తెలియడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మాతృత్వంపై స్టార్ హీరోయిన్ వ్యాఖ్యలు వైరల్..



**మాతృత్వంపై ఓ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్న ప్రముఖ నటి వరలక్ష్మి శరత్‌కుమార్, తనకు పిల్లలను కనా లనే ఆలోచన లేదని స్పష్టంగా చెప్పింది. దీనికి గల కారణాలను కూడా ఓ ఇంటర్వ్యూలో ఓపెన్‌గా వెల్లడించింది. 'అమ్మతనం అనేది చాలా పెద్ద బాధ్యత. పిల్లలను కనడమే తల్లి అవడం కాదు. నేను నా చెల్లికి తల్లిగా ఉంటా ను, నా పెట్ డాగ్స్‌ను తల్లిలా చూసుకుంటాను. నా స్నేహితులు, సన్నిహితులను కూడా తల్లిలా ఆదుకుంటాను. అవసరంలో ఉన్నవారికి తోడుగా నిలబడడమే నాకు అమ్మతనం అర్థం. వ్యక్తిగతంగా నాకు పిల్లలను కనాలనే ఆలోచన లేదు. అయితే భవిష్యత్‌లో ఏమైనా మారవచ్చు. ఎందుకంటే ఒకప్పుడు పెళ్లి కూడా వద్దనుకున్నాను' అని వరలక్ష్మి చెప్పకొచ్చింది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారి తీశాయి.**

—అక్షరటుడే, సినిమాడెస్క్